క్లుప్తంగా

విద్యార్థుల సామర్థ్యాలు వెలికితీసేందుకు



బలిజిపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులు రాస్తున్న పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ-1సామల

బలిజిపేట: విద్యార్థుల సామర్థ్యాలను వెలికితీసేందుకు ఎస్ఏ-1 పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని ఎంఈఓ-1సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు బలిజిపేట ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను శుక్రవారం ఆయన పరిశీలించారు. పరీక్షలు రాసేవిధానంలో కొన్ని సూచనలు, సలహాలు విద్యార్థులకు ఇచ్చారు. ఈ పరీక్ష విధానాన్ని పటిష్టంగా నిర్వహించనున్నామన్నారు. అందువల్ల దీనిని ప్రామాణికంగా తీసుకోవచ్చని తెలిపారు. పరీక్షల అనంతరం వెనుకబడిన విద్యార్థులలో సామర్థ్యాలను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శన

సీతానగరం: మండలంలోని నిడగల్లు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.తిరుపతి నాయుడు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న స్టడీ అవర్‌ను ప్రత్యేకంగా పరిశీలించి పిల్లల సామర్థ్యాన్ని పరీక్షించారు. కొంతమంది విద్యార్థులకు వివిధ రకాలుగా ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. తదనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పాఠశాల సిబ్బందితో సమావేశమై పాఠశాల ప్రగతికి సంబంధించి వివిధ రకాల విషయాల్ని తెలియజేశారు. ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థులు మరింత ప్రగతి సాధించడం కోసం కొన్ని సూచనలు సలహాలు అందించారు. పాఠశాల సిబ్బంది అంతా లెసన్ ప్లాన్లు, టీచింగ్ నోట్స్ మొదలైన వాటిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. పాఠశాల ప్రగతికి ఉపాధ్యాయులు అంతా సమష్టి బాధ్యతగా తీసుకొని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు.

14 నుంచి జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

పార్వతీపురంటౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20 వరకు పార్వతీపురం జిల్లాలో విద్యుత్ శాఖ (ఆంధ్ర ప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ) ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.చలపతి రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, విద్యుత్ పొదుపు అవగాహన ర్యాలీలు జిల్లా ప్రధాన కేంద్రం, డివిజన్ కేంద్రాలలో నిర్వహించనున్నామన్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా విద్యుత్ పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు, స్వయం సహాయక మహిళ బృందాలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, వారికి ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటెడ్ గృహోపకరణాల ప్రయోజనాలపై అవగాహన కల్పించనున్నామన్నారు. పోటీలలో విజేతలకు 20న బహుమతుల ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

కిశోరీ బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

మక్కువ: కిశోరీ బాలికల ఆరోగ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ఈవోపీఆర్డీ పి.దేవకుమార్ కోరారు. ఈ మేరకు స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరీ వికాసం మండలస్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఈవోపీఆర్డీ దేవకుమార్, ఎస్సై వెంకటరమణ మాట్లాడారు. కిశోరీబాలికల ఆరోగ్యం, విద్య, బాల్యవివాహాల నిర్మూలన, బాలల రక్షణ చట్టాలు, పోక్సో చట్టం, డ్రాపౌట్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం సీడీపీవో అనంతలక్ష్మి మాట్లాడుతూ ప్రతినెల రెండుసార్లు సమావేశాలను సచివాలయ పరిధిలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం జయకుమార్, డీసీపీఓ సత్యనారాయణ, హెల్త్‌ఆఫీసర్ విజయలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరత్నం, సూపర్‌వైజర్లు లీలావతి, రాజశ్రీ, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రహదారి ఆక్రమణలపై చర్యలు తప్పవు

పార్వతీపురంటౌన్: పట్టణ ప్రధాన రహదారిలో ఆక్రమణలపై చర్యలు తప్పవని పార్వతీపురం పట్టణ సీఐ మురళీధర్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం రహదారికి ఇరువైపులా కాలువలపై ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి ఆక్రమణల వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. పట్టణంలో రహదారి ఆక్రమణల కారణంగా తీవ్రంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. వ్యాపారస్తులు రహదారిపై తోపుడుబండ్లతో వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారని పట్టణ శివారులో వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. దుకాణదారులు వ్యాపారాల నిమిత్తం తమ దుకాణాల ఎదురుగా ఉన్న కాలువలను ఆక్రమించి వాటిపై వ్యాపారాలు చేస్తున్నారని, పట్టణంలో రహదారిపై ప్రతిరోజూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వారికి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై గోవిందరావు, ట్రాఫిక్ ఎస్సై పాపారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతపై బీమా భారం

- ప్రీమియం చెల్లిస్తేనే పరిహారం
- 15వ తేదీ తుదిగడువు




రబీలో వేసిన మొక్కజొన్న పంట

బలిజిపేట:

రబీ సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటకు నష్టం వాటిల్లితే రైతు పరిహారం పొందేందుకు ఈనెల 15వ తేదీ లోపు ప్రీమియం చెల్లిస్తేనే పరిహారం వస్తుందనే నిబంధనతో రైతుపై కూటమి ప్రభుత్వం బీమా భారాన్ని మోపింది. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు మొండిచేయి చూపించడంపై రైతుల్లో అసంతృప్తి రేగుతోంది. పెట్టుబడి సాయం లేదు. ఉచిత పంటల బీమా పథకం లేదు. ఎరువుల ధరలు పెరిగాయి. ఇంకెలా రైతుకు మేలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులపై పైసా భారం మోపకుండా ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేతులెత్తేసింది. పంటలసాగు ఖర్చులతో సతమతమవుతున్న తాము బీమా ఏవిధంగా చెల్లించగలమని రైతులు లబోదిబోమంటున్నారు.

పథకం పేరు మార్పు తప్ప అమలు శూన్యం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతుకు అన్ని విధాలా అండగా ఉండేది. గత ప్రభుత్వంలో రైతుభరోసా పథకాన్ని అమలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆపథకం పేరును అన్నదాత సుఖీభవగా మార్చారు. గత ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్‌లో ప్రారంభం నుంచి రైతుభరోసా కింద రైతుల బ్యాంకు ఖాతాల్లో సంవత్సరానికి రూ.13వేలు జమ అయ్యేవి. ఈ ప్రభుత్వం పథకం పేరుమార్చినా నగదు మాత్రం నేటికీ జమ చేయలేదంటూ రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు.



ప్రీమియం చెల్లింపు ఎలా అంటే

పంట	ఎకరాకు చెల్లించాల్సిన ప్రీమియం	వచ్చే పరిహారం (ఎకరాకు)
మొక్కజొన్న	రూ.72	రూ.36,000
పెసర	రూ.40	రూ.20,000
వరి	రూ.84	రూ.42,000

బీమా చెల్లింపు భారమే: తుఫాన్, భారీ వర్షాలతో పంట నష్టం జరిగినప్పుడు పరిహారం పొందేందుకు రైతులకు పంటల బీమా పథకం దోహదపడుతుంది. గత ప్రభుత్వం హయాంలో 2019, అక్టోబర్ సీజన్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. ఈక్రాప్ చేసుకున్న రైతులందరికి ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించి ఆదుకుంది. దీంతో బీమా చెల్లించే పనిలేకుండా పంటకు నష్టం జరిగితే రైతుకు పరిహారం అందేది. రైతులతో పాటు కౌలు రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందింది. ఈ ఏడాది పంటల బీమా ప్రీమియంను రైతులే చెల్లించుకోవాలని ప్రభుత్వం తమపై భారం మోపడం దారుణమంటున్నారు.

రబీసాగు అంచనా:

బలిజిపేట మండలంలో రబీసాగులో వరి 150ఎకరాలు, అపరాలు 4,500ఎకరాలు, మొక్కజొన్న 1,500ఎకరాలు ఉంటుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇది పెరిగే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ముఖ్యంగా ఈపంటలే అధికంగా పండిస్తుండడంతో వాటికే ప్రీమియం అందుబాటులో ఉండే అవకాశాలున్నాయి. పంటల బీమా ప్రీమియం కింద రైతులు ఈనెల 15వ తేదీలోపల ప్రీమియం చెల్లించాలని అధికారులు చెబుతున్నారు.

ప్రీమియం చెల్లిస్తే ఎంతో మేలు:

ప్రభుత్వం నిర్ధారించిన ప్రీమియంతో రైతులకు మేలు జరుగుతుంది. రబీలో పంటలకు నష్టం వాటిల్లితే పరిహారం అందుతుంది. ప్రీమియం తక్కువ మొత్తంలోనే ఉన్నందున రైతులు కట్టుకోవాలి. ఇప్పటికే రైతులు ప్రీమియం చెల్లిస్తున్నారు.

శ్రావణ్‌కుమార్ నాయుడు, ఏఓ, బలిజిపేట

నీటి సంఘాల ఎన్నికల్లో సహకరించాలి



మాట్లాడుతున్న ఎన్నికల నిర్వాహకులు తహసీల్దార్ ఉమామహేశ్వర రావు, ఏఈ శ్రీనివాసరావు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో శనివారం జరగనున్న నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని సంబంధిత అధికారులు ఎ.ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరావులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన మెటీరియల్‌ను తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావు, ఇతర ఎన్నికల అధికారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం ఉదయం నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలవుతుందని, ఎన్నికల సమయంలో ఎన్నికల అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. మండలంలో 17 మైనర్ ఇరిగేషన్ చెరువులు, సీతానగరం ప్రాజెక్ట్, మీడియం ఇరిగేషన్ పరిధిలో ఉన్న వెంగళరాయ సాగర్ ప్రాజెక్ట్ పరిధిలో టీసీలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. వెంగళరాయ సాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన ఎన్నికలు అంటిపేటలో, సీతానగరం సాగునీటి ప్రాజెక్టుకు సంబంధించిన ఎన్నికలు తామరఖండిలో జరుగుతాయన్నారు. వెంగళరాయ సాగర్ ప్రాజెక్టుకు స్పందించిన లచ్చయ్యపేట, అంటిపేట, వెన్నెలబుచ్చింపేట, గుమ్మిడివరం, రామవరం, ఆర్ వెంకంపేట, వెంకటాపురం, అంటిపేట, రెడ్డివానివలస గ్రామాల రైతులు అంటిపేటలో జరగనున్న పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకోవలసి ఉందన్నారు. కార్యక్రమంలో పోలింగ్ అధికారులు ఏపీఓలు పాల్గొన్నారు.

బీసీలకు ఉచిత డీఎస్సీ కోచింగ్ ప్రారంభం



సమావేశంలో మాట్లాడతున్న జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఎం.డి గయాజుద్దీన్

పార్వతీపురంటౌన్: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీలు, ఎస్సీలకు ఉచిత డీఎస్సీ కోచింగ్ పార్వతీపురంలో శుక్రవారం ప్రారంభమైంది. ఈ మేరకు పార్వతీపురంలోని భాస్కర కళాశాలలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఎం.డి గయాజుద్దీన్ ఉచిత కోచింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత కోచింగ్ రెండు నెలల పాటు కొనసాగుతుందని, రాష్ట్రంలో 16500 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కోచింగ్ ఇవ్వనున్నారని తెలిపారు. కోచింగ్‌లో శ్రద్ధగా తరగతులను విని, కష్టపడి చదివి ప్రతిఒక్కరూ ఉద్యోగం సాధించాలని పిలుపునిచ్చారు. అనుభవం గల శిక్షకులు ఉన్నారని, వారి సేవలు వినియోగించుకుని ప్రతి సబ్జెక్ట్‌లో పట్టు సాధించాలని సూచించారు. పట్టుదల, అంకిత భావం ఉంటే సాధించలేనిది ఏదీ లేదని స్పష్టం చేశారు. జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఎస్.కృష్ణ మాట్లాడుతూ ఉచిత కోచింగ్ రెండు నెలల పాటు కొనసాగుతుందని, ప్రస్తుతం 40 మంది విద్యార్థులు శిక్షణలో చేరారని, ఇంకా 70 మంది బీసీ అభ్యర్థులు, 30 మంది ఎస్సీ అభ్యర్థులకు చోటు కల్పించే అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు త్వరగా శిక్షణలో చేరి ప్రయోజనం పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రణాళికాబద్ధంగా అమలు చేసి, సామాజికపరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు కోరారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, సచివాలయాల ఉద్యోగులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు రెండవ రోజు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో సామాజిక పరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి ఒక్కరికీ ఉపయోగ పడేవిధంగా పనులు చేపట్టడానికి ముందుగా ప్రణాళికలు తయారుచేసుకోవాలని వాటికి గ్రామపంచాయతీ పాలకుల ఆమోదం పొందాలని స్పష్టం చేశారు. పనులు పారదర్శకంగా నిర్వహించడానికి ఇంజినీరింగ్ సహాయకులు దృష్టి సారించాలని కోరారు. ప్రత్యేకించి బహిరంగ మలవిసర్జన చేయకుండా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు ప్రజలను చైతన్య పర్చాలని కోరారు. పారిశుధ్య పనులు తరచూ నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఎస్వీ రమణ, ఏపీఎం ఆర్.శ్రీరాములు, ఎంఈఓ-2 ఎం వెంకటరమణ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిరోధానికి జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న ఏఎస్సై లెంక శ్రీనివాసరావు

సీతానగరం: పట్టణ, గ్రామ ప్రాంతాల్లో జరుగుతున్న సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నిరోధానికి ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఏఎస్సై లంక శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలో జరుగుతున్న సంకల్పం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అప్పయ్యపేట, జోగింపేట గ్రామాల్లో ఎస్సై ఎం.రాజేష్ పర్యవేక్షణలో సైబర్‌నేరాలు, మాదకద్రవ్యాల వినియగం నిరోధించడం రోడ్డుప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాలతో చెలగాటమాడుతున్న మాదక ద్రవ్యాలను నిరోధించడానికి, వాటివల్ల వచ్చే అనర్థాలను తెలియజేశారు. అలాగే ఇటీవల జరుగుతున్న సైబర్ నేరాలు నివారించడానికి ముందు జాగ్రత్తచర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు గ్రామాల్లో వాహన చోదకులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తూ రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను గుర్తుంచుకుని వాహనాలు నడపాలని కోరారు. అనుభవం లేకుండా కార్లు, మోటారు వాహనాలు నడపడం, మద్యం తాగి డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ద్విచక్రవాహన చోదకులు విధిగా హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీట్ బెల్ట్ ధరించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు చేరిన పుస్తకాలు

బలిజిపేట: బలిజిపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న బలిజిపేట, సీతానగరం మండలాల్లో ఉన్న 180అంగన్వాడీ కేంద్రాలకు పీపీ-1, పీపీ-2 కొత్త పుస్తకాలు వచ్చినట్లు సీడీపీఓ సులేఖ తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం బలిజిపేట మండలంలో 94అంగన్వాడీ కేంద్రాలకు, సీతానగరంలో 86కేంద్రాలకు పీపీ-1కు సంబంధించి ఇంగ్లీషు, లెక్కలు, స్పోకెన్ ఇంగ్లీషు, ఏక్టివిటీ, తెలుగు పుస్తకాలు 3,455, పీపీ-2కు సంబంధించి స్పోకెన్ ఇంగ్లీషు, లెక్కలు, ఇంగ్లీషు, ఏక్టివిటీ, తెలుగు పుస్తకాలు 2,575వచ్చినట్లు చెప్పారు. వీటిని కేంద్రాల వారీగా పంపిణీ చేయనున్నామని తెలిపారు. కొత్త పుస్తకాలతో పిల్లలకు పాఠ్యాంశాలు బోధించేవిధంగా అంగన్వాడీ టీచర్లకు సూచించనున్నట్లు స్పష్టం చేశారు.

రెవెన్యూ సదస్సుల ద్వారా భూముల సమస్య పరిష్కారం




మాట్లాడుతున్న సదస్సుల స్పెషల్ ఆఫీసర్, సర్వేశాఖ ఎ.డి పి.లక్ష్మణరావు

సీతానగరం: దీర్ఘకాలంగా రైతులు ఎదుర్కొంటున్న భూముల సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకునేందుకు అవకాశం కలుగుతుందని ల్యాండ్ సర్వే-సెటిల్‌మెంట్ శాఖ ఎ.డి పి.లక్ష్మణరావు అన్నారు. ఈ మేరకు పెదభోగిలి1,2 సచివాలయాల పరిధిలో ఉన్న నాలుగు గ్రామాల రైతులకు పెదభోగిలి పాత పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆర్ఐ ఎన్ శ్రీనివాసరావుతో కలిసి శుక్రవారం ఆయన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వివిధ కారణాలవల్ల రైతులు ఎదుర్కొంటున్న భూములకు సంబంధించిన సమస్యలు సదస్సుల ద్వారా పరిష్కరించుకునేం దుకు అవకాశం కల్పించినట్లు తెలియజేశారు. భూముల సమస్యలున్న రైతులు గ్రామసభలో ఫిర్యాదులు సమర్పించాలని కోరారు. గ్రామాల్లో భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించడానికి క్షేత్రస్థాయి అధికారుల నుంచి మండలస్థాయి అధికారులు సిద్ధంగా ఉన్నారని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వోలు కుమారస్వామి, సింహాచలం, వీఆర్ఏలు, అప్పయ్యపేట, బుడ్డిపేట, పెదబోగిలి, సీతానగరం గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సాగునీటి ఎన్నికల్లో ఓటమి భయం

- నోడ్యూస్ సర్టిఫికెట్‌కు నిరాకరణ
- రైతులకు అందుబాటులో లేని తహసీల్దార్
- తహసీల్దార్‌పై ఫిర్యాదుచేసిన వైఎస్సార్‌సీపీ, జనసేన, సీపీఎం నాయకులు
- ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించిన వైఎస్సార్‌సీపీ



మక్కువ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకులు


మక్కువ: నీటిసంఘాల ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే, అధికారపక్షం, అధికారులను పావుగా వాడుకుందని జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు ధ్వజమెత్తారు. మక్కువ మండలంలో 11 నీటి సంఘాలు ఉన్నాయి. శనివారం నీటిసంఘాల ఎన్నికలు జరగనున్నాయి. అందుకోసం ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు నీటి తీరువా వసూళ్ల రసీదు (నో అబ్జక్షన్ సర్టిఫికెట్) అందించాల్సి ఉంది. ఈ మేరకు జిల్లాస్థాయి అధికారులు, మండలస్థాయి రెవెన్యూ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది. పలువురు రైతులు గడిచిన మూడురోజులుగా రెవెన్యూ అధికారులను సంప్రదించగా, ఇదిగో, అదిగో అంటూ శుక్రవారం వరకు దాటవేసినట్లు రైతులు చెబుతున్నారు. శుక్రవారం ఉదయం 11గంటలకు నోఅబ్జక్షన్ సర్టిఫికెట్ కోసం సుదూరప్రాంతాలనుంచి రైతులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ షేక్ఇబ్రహీమ్‌కు జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, జనసేన మండల నాయకుడు పెంట తిరుపతిరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడులు ఫోన్లు చేసినప్పటికీ సాయంత్రం 6గంటలు వరకు తహసీల్దార్ కార్యాలయానికి ఆయన చేరుకోకపోవడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహంతో ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించి, కార్యాలయం నుంచి రైతులతో కలిసి వెనుదిరిగారు.

తహసీల్దార్‌పై ఫిర్యాదు

నీటితీరువా బిల్లు చెల్లించేందుకు తహసీల్దార్ కార్యాలయానికి శుక్రవారం ఉదయం 10గంటలకు చేరుకున్నప్పటికీ, సాయంత్రం 4గంటల వరకు తహసీల్దార్‌తో పాటు, వీఆర్వోలు అందుబాటులో లేకపోవడంతో జనసేన నాయకుడు పెంట తిరుపతిరావు పోలీసులకు ఫిర్యాదుచేశారు. అలాగే రైతుల పట్ల నిర్లక్ష్యధోరణితో వ్యవహరించిన తహసీల్దార్‌పై ఫిర్యాదుచేసినట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు విలేకరులకు తెలిపారు.

గందరగోళంగా ఎన్నికలకు సిద్ధం

- తప్పులతడకగా ఓటర్ల జాబితా
- పరిగణనలోకి భూమి శిస్తు చెల్లింపు



బర్లి ఓటర్ల జాబితాలో కనిపిస్తున్న చనిపోయినవారి పేర్లు



పెదంకలాం కాలువ

బలిజిపేట:

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ గందరగోళంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు అందుకు తగిన విధంగా చర్యలు చేపట్టలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓటర్ల జాబితాలు సక్రమంగా లేకపోవడం, చనిపోయినవారి పేర్లు జాబితాలో కనిపించడం, కొత్త, కొత్త పేర్లు కనిపిస్తుండడం, భూమి శిస్తు చెల్లింపులు వంటి సూచనలను అధికారులు కచ్చితంగా తెలియపరచకపోవడం వంటివి రైతులకు శిరోభారంగా మారాయి. ఎన్నికలలో అభ్యర్థులుగా పోటీచేయాలనుకునే వారు భూమిశిస్తు చెల్లింపులు చేసినవారే అర్హులవుతారు. దీనికి సంబంధించి శిస్తు చెల్లింపు ఆన్‌లైన్ ద్వారానా, ఆఫ్‌లైన్ ద్వారానా అనేది మరో ప్రశ్న. అధికారులు ఈవిషయాన్ని స్పష్టంగా తెలియపరచలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సచివాలయాల వద్ద ఎన్నికలకు సంబంధించిన నియమనిబంధనల నివేదికను అంటించలేదని, గ్రామంలో దండోరా వేయించలేదని, ఓటర్ల జాబితాలో తప్పుఒప్పులను సక్రమంగా సవరించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియలో ఏవ్యవహారం ఏ సమయంలో చేపడతారు, దానికి ఎంత సమయం కేటాయించారు, ఎలా నిర్వహిస్తారనేది రైతులకు అవగాహన లేకుండా పోయిందని, ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎవరికీ తెలియడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.


ఏకాభిప్రాయం కుదిరితే..

- 14వ తేదీ ఉదయం వరకు ఓటర్లను సాధారణ సర్వసభ్య సమావేశానికి అనుమతించాలి. అప్పుడు టీసీల వారీగా ఓటర్ల గుర్తింపుకార్డులు ఉండాలి.
- సరైన ఓటర్లను ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా కూర్చోపెట్టాలి.
- ఉదయం 9గంటల నుంచి 9.45వరకు ఏకాభిప్రాయం ద్వారా టీసీల సభ్యులను గుర్తించేందుకు కృషిచేయాలి.
- ఏకాభిప్రాయం కుదిరితే ఉదయం 9.45గంటల నుంచి 1.30వరకు అభ్యర్థి నీటి పన్ను ఎగవేతదారుడుగా ఉండకుండా చూసుకుని అభ్యర్థి నామినేషన్, సాక్షుల వివరాలు తీసుకోవాలి. ఆ తరువాత నామినేషన్ పరిశీలించి అంగీకరించిందా? తిరస్కరించిందా? అనేది ఎన్నికల అధికారికి తెలియపరచాలి.
- ఎన్నికైన అభ్యర్థిని టీసీగా ప్రకటించాలి
- మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నీటి సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుల ఎన్నిక. ఈ ఎన్నికలో నిర్ధారించిన నియమ, నిబంధనలు పాటించాలి.

ఏకాభిప్రాయం కుదరనప్పుడు..

ఏకాభిప్రాయానికి రానప్పుడు ఉదయం 9.45గంటల నుంచి 10.15గంటల వరకు పోటీకి నామినేషన్లు తీసుకోవాలి, వారిని ప్రతిపాదించిన సాక్షులను తీసుకోవాలి. వారిరువురూ ఆ ప్రాదేశిక ఓటర్లు అయి ఉండాలి.

- ప్రభుత్వానికి నీటిపన్ను ఎగవేతదారుడై ఉండరాదు. ప్రభుత్వ ఉద్యోగి కానీ, ఏదైనా చట్టబద్ధమైన హోదా కానీ కలిగిఉండరాదు, క్రిమినల్ చట్టాల ప్రకారం దోషి కాకూడదు.
- పోలింగ్ అధికారి నామినేషన్ పత్రాలను వారికి సమర్పించాలి.
- ఏకాభిప్రాయం రానప్పుడు ఉదయం 10.15గంటల నుంచి 10.30గంటల వరకు నామినేషన్ల పరిశీలన.
- 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు టీసీల ఎన్నిక ప్రక్రియ. ఇందుకు రహస్య ఓటింగ్ విధానంతో ఎంపిక జరుగుతుంది. దీనికి ఓటింగ్ స్లిప్పులు తయారుచేసి పంపిణీచేసి ఓటువేయించాలి. అనంతరం ఓటింగ్ స్లిప్పులు లెక్కించాలి. ఆ తరువాత ఎన్నికల ఫలితాల ప్రకటన.
- మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక జరుగుతుంది.



తప్పడుగా ఉన్న ఓటర్ల జాబితా

ఓటర్ల జాబితాలో తప్పులు

ఓటర్ల జాబితాలో తప్పులు ఉన్నప్పటికీ వాటిని సవరించిన దాఖలాలు లేవు. తప్పులతడకగా ఉండే జాబితానే అందించారు. అందుకు తార్కాణంగా బర్లిలో 1వ నంబర్ టీసీలో చనిపోయిన గుల్లిపల్లి రామినాయుడు, ఏగిరెడ్డి సూర్యనారాయణ, గుల్లిపల్లి జగన్నాథం నాయుడు పేర్లు జాబితాలో కనిపిస్తున్నాయి. వారు చనిపోయినప్పటికీ పేర్లు ఓటర్ల జాబితాలో వచ్చినా అధికారులు సరిచేయకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడే కాకుండా వివిధ టీసీలలో ఈ విధంగా ఎన్నో తప్పులు కనిపిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఓటర్ల జాబితాలో ఎవరెవరి పేర్లో ఉన్నాయని వారు ఎవరో ఎవరికీ తెలియడం లేదని, ఇటువంటి వాటిని గ్రామసభ పెట్టి అధికారులు, సిబ్బంది చెప్పకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఎన్నికలు అంతా గందరగోళంగా ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.